## శ్రీ భద్రకాళి అమ్మవారికి విశేష పూజలు

చిట్వేలి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:

పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా బెంగళూరు, కేరళ నుంచి వచ్చిన అర్చకులు ఉదయం నిర్వహించిన చండీ హోమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. నాగదేవతకు, వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భద్రకాళి అమ్మవారికి, వీరభద్ర స్వామికి అర్చకులు మృత్యుంజయ విశేష పూజలు, అలంకరణ గావించారు. సామూహిక కుంకుమార్చనలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆలయ పెద్దలు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.



వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక వార్త






# ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట

### ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట
### పోతన భాగవతాన్ని రచించి...
### ఇక్కడే రామునికి అంకితమిచ్చి..
### . నాటి దండకారణ్యమే...
### నేటి ఏకశిలా నగరం...



తల్లీ ! సరస్వతి !
నేను పుట్టలో పుట్టిన వాల్మీకిని కాను,
రెల్లు పొదలో పుట్టిన కుమారస్వామిని కాను
నావలో పుట్టిన వ్యాసుడిని కాను ..
కాళీమాత అనుగ్రహం పొందిన
కాళిదాసునుకాను.. ..నేను భాగవత
పురాణాన్నిరచించాలనుకుంటున్నాను.
నాకు తగినంత శక్తిని ప్రసాదించమ్మా...
ఓ దయగల తల్లి... బ్రహ్మాణి

అని భాగవత రచనకు ఉపక్రమించే సందర్భంలో సహజ పండితుడు బమ్మెర పోతనా మాత్యులు సరస్వతీ దేవిని స్తుతించాడు. తర్వాతనే భాగవతాన్ని ఇక్కడే రచించాడు. అందులో భాగంగానే ఈ పద్యాన్ని పలికారు.

**పలికెడిది భాగవతమట**
**పలికించెడు వాడు రామభంద్రుడ ట**
**నే బలికిన భవహర మగునట**
**పలికెద వేరెండు గాధ బలుకగక నెలా.. దీని భావం**
**పలికేది పరమ పవిత్రమైన భాగవతమా..**
**. పలికించే ప్రభువు కరుణాసముద్రుడైన రామభద్రుడా..**
**పలికినందువల్ల భవబంధాలు పరిహారమవుతాయా..**
**అటువంటప్పుడు వృధాగా మరో కథ పలకడం దేనికి..**
**భాగవతమే పలుకుతాను... అంటూ బమ్మెరపోతన**

మహా భాగవతాన్ని ఒంటిమిట్ట లోనే రచించి కోదండ రామునికి అంకితం ఇచ్చాడు.

ఈ భాగవతాన్ని కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామికి అంకితం కూడా ఇచ్చాడు. ఇది చరిత్ర చెబుతున్న అక్షర సత్యం. ఇక్కడ పోతన మడి కూడా ఉంది. పలికెడిది భాగవతమట పలికించెడు వాడు రామభంద్రుడ టనే బలికిన భవహర మగున టపలికెద వేరెండు గాధ బలుకగక నెలా.. దీని భావం పలికేది పరమ పవిత్రమైన భాగవతమా... పలికించే ప్రభువు కరుణాసముద్రుడైన రామభద్రుడా.. పలికినందువల్ల భవబంధాలు పరిహారమవుతాయా.. అటువంటప్పుడు వృధాగా మరో కథ పలకడం దేనికి.. భాగవతమే పలుకుతాను... అంటూ బమ్మెరపోతన మహా భాగవతాన్ని ఒంటిమిట్ట లోనే రచించి కోదండ రామునికి అంకితం ఇచ్చాడు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రం విభజన తర్వాత భద్రాచలం స్థానంలో ఒంటిమిట్ట రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. బ్రహ్మోత్స వాలలో భాగంగా రెండో రోజు శ్రీరామచంద్రుడు ఉదయం వేణుగాన లోలుడై... రాత్రి హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రభాతవార్త రాజంపేట అర్బన్‌రాజంపేట అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త



భాగవతాన్ని కోదండ రామునికి అంకితం ఇచ్చిన బమ్మెర పోతన

## వేణు గాన రాముడు...
## హంస పై విహారం

చారిత్రక ,ఇతిహాస, పురాణ చరిత్ర ప్రకారం నాటి దండకారణ్యమే నేటి ఏకశిలా నగరం. ఒంటిమిట్ట గత చరిత్ర ఎంతో వైభవం. సీతా సమేతుడైన శ్రీరామచంద్రుడు ఈ మార్గంలో వెళుతూనే సీతమ్మ తల్లి దప్పిక కొనడంతో రామబాణాన్ని సంధించి రామ తీర్థాన్ని సృష్టించాడు. భారతదేశ చరిత్రలో అతి పవిత్రమైన మహాభాగవతాన్ని సహజ పండితులు బమ్మెర పోతన ఇక్కడే రచించాడు. కోదండ రామునికి మహా భాగవతాన్ని అంకితమిచ్చాడు. ఇక్కడ పోతన మడి కూడా ఉంది. భాగవత రచనకు ఉపక్రమించే ముందు పోతన సరస్వతి దేవిని ఈ విధంగా ప్రార్థించాడు.







ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి 7 గంటల నుండి హంస వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులను కటాక్షించారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం సంపూర్ణంగా కలుగుతుంది. హంస వాహనంలోని పరమార్థం ఇదే. హంసలో పాలను, నీళ్లను వేరుచేసే సామర్థం ఉంది. భక్తులలో అహంభావం తొలగించి దాసోహం అనే భావం కలిగించడానికే పరమహంస రూపానికి ప్రతీక అయిన హంసవాహనాన్ని స్వామివారు అధిరోహిస్తారు.









## శరవేగంగా హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు
## రూ.649కోట్లతో పనులు : ఎస్ఈ విఠల్‌ప్రసాద్

మదనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

హంద్రీ-నీవా పేజ్-2 కాలువ లైనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు హెచ్ఎన్ఎస్ ఎస్ఈ విఠల్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి రూ.649కోట్లతో లైనింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 40శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. మే 31లోపు లైనింగ్ పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకొన్నట్లు ఆయన తెలిపారు. చెర్లోపల్లి రిజర్వాయర్‌లో ఒక టిఎంసి నీటిని జూన్ నెలలో హంద్రీ-నీవా కాలువ ద్వారా ఇక్కడి ప్రాంత ప్రజలకు తాగు,సాగునీరు తీసుకువచ్చేందుకు ఇరిగేషన్‌శాఖ చర్యలు తీసుకొంటుందన్నారు



### అంగరంగ వైభవంగా ఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్సవాలు
## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రుల బృందం

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాతవా ర్తఒంటిమిట్ట శ్రీరామ బ్రహ్మోత్స వాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈ మేరకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవాలయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ,రాష్ట్ర యువజన, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు.ఏప్రిల్ 11న జరిగే సీతారాముల కల్యాణానికి సీఎం చంద్రబాబు నాయుడు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్న నేపథ్యంలో మంత్రుల బృందం ఒంటిమిట్టలో పర్యటించింది. ఏర్పాట్లను పర్యవేక్షించింది.కళ్యాణానికి రాష్ట్రవ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడం జరుగుతుందని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పర్యటనను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీఎం పర్యటనలో ఎటువంటి చిన్న సమస్య కూడా తలెత్తకుండా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జెఈఓ వీరబ్రహ్మం మంత్రులకు వివరించారు. అంతకుముందు వారు ఒంటిమిట్టకు చేరుకున్న వెంటనే జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుమల దేవస్థానం పురోహితులు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



రాష్ట్ర మంత్రులకు స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

## ఎస్డిసి మృతి రెవెన్యూ శాఖకు తీరని లోటు
### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రాయచోటి, ఏప్రిల్ 7ప్రభాత వార్త

సోమవారం ఉదయం రాయిచోటి జిల్లా కేంద్రంలో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొనడానికి పీలేరు నుండి బయలుదేరిన హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ రమ సంబేపల్లి మండలం యర్రగుంట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన గురించి తెలిసిన వెంటనే పిజిఆర్ఎస్ హాల్ నుంచి వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన వారిని వెంటనే రాయచోటి జిల్లా ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రమాదంలో అప్పటికే ఎస్డిసి ఎస్.రమ మృతి చెందిన విషయాన్ని వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాద దుర్ఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల దృష్టికి జిల్లా కలెక్టర్ తీసుకువెళ్లారు. ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి కూడా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. మృతి చెందిన ఎస్డిసి గారి భర్త రాజేంద్ర నాయక్ తో ముఖ్యమంత్రి గారితో కలెక్టర్ ఫోన్లో మాట్లాడించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి గారు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీమతి ఎస్. రమ పార్థివదేహానికి.. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్డీవో శ్రీనివాస్ నివాళులు అర్పించారు. పీలేరులో హెచ్ఎంఎస్ఎస్ ఎస్ డి సి గా పనిచేస్తున్న శ్రీమతి ఎస్ రమాను కోల్పోవడం అత్యంత బాధాకరమని... రెవెన్యూ శాఖకు తీరని లోటు అని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్ డి సి ఎస్ రమాకు అప్పగించిన విధులను ఎంతో బాధ్యతాయుతంగా అంకిత భావంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు లక్ష్యాలను పూర్తి చేసేవారని పేర్కొన్నారు. ఎస్ డి సి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు డిఆర్ఓ స్వయంగా ఏర్పాట్లను చేసి అనంతపురం జిల్లా తిమ్మాపురం గ్రామానికి శ్రీమతి ఎస్ రమ పార్థివదేహాన్ని పంపడం జరిగింది. అంతకు ముందుగా ఉదయం పిజిఆర్ఎస్ హాలులో సమావేశమైన జిల్లా అధికారులందరూ ఎస్ డి సి శ్రీమతి ఎస్.రమ ప్రమాదంలో మృతి చెందడం పై తమ సంతాపాన్ని వ్యక్తపరిచి రెండు నిమిషాలు మోనం పాటించారు.

**2005లో గ్రూప్ 2 ద్వారా ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశం**

శ్రీమతి ఎస్. రమా 2005లో గ్రూప్2 ద్వారా ప్రొబేషనరీ డిప్యూటీ తాసిల్దారుగా ప్రభుత్వ సర్వీసులో చేరారు. అప్పటినుంచి వివిధ హోదాలలో ఆమె తన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలను పొందారు. ఫిబ్రవరి 2024 లో పీలేరు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ టు స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా అన్నమయ్య జిల్లాకు వచ్చారు. విధుల పట్ల ఆమె చూపుతున్న శ్రద్ధ, అంకిత భావం దృష్టిలో ఉంచుకొని పీజీఆర్ఎస్ జిల్లా సమన్వయ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఆ విధులను ఆమె ఎంతో సమర్థవంతంగా నిర్వర్తించేవారు. ఆమె మృతిపై రెవెన్యూ శాఖలోని అధికారులు, సిబ్బంది కూడా తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ప్రజలు మెచ్చేలా అభివృద్ధిని సాధిస్తా...

**రూ.4.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన నల్లారి**
**రూ.1800 కోట్లతో గండికోట నుంచి నియోజకవర్గానికి త్రాగునీరు**
**ముస్లీం సోదరుల సహకారం, మమకారం మరువలేనిది**



పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

పీలేరు నియోజకవర్గ ప్రజలందరూ మెచ్చేలా అభివృద్ధిని సాధిస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణంతో పాటు మండలంలోని పలు చోట్ల రూ.4.10 కోట్ల నిధులతో పూర్తైన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు భూములు ఆక్రమించు కోవడం, అమ్ముకోవడం సొమ్ము చేసుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. వైయస్ఆర్ దేళ్ల పాలనలో అభివృద్ధికి నోచుకోని పీలేరులో ప్రజలు విసుగెత్తి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించడంతోపాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి తీసుకొచ్చి ప్రజలను మరువలేనని అన్నారు. పీలేరు అన్ని విధాల అభివృద్ధి చేసి వారి రుణం తీర్చుకోవడానికి కృషి చేస్తానని చెప్పారు. అందులో భాగంగానే రూ.4.10 కోట్లు ఖర్చు చేసి ప్రజలకు త్రాగునీరు అందించడం, సిసి రోడ్ల నిర్మాణం, విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు, పీలేరు ఈద్గా మైదానంలో సిమెంట్ ఫ్లోరింగ్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులతో పాటు, ప్రజా సంక్షేమ, మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తిచేయడం జరిగిందని అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

**సమస్యలతో ఏ ఒక్కరు బాధపడకూడదు**
**రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



చిన్నమండెం, ఏప్రిల్ 7 ప్రబాత వార్త :

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ చేయమని సమస్యల తో ఏ ఒక్కరు బాధప డకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం, బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధితుల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

## జాతీయ ఆరోగ్య మిషన్ పై అవగాహన ర్యాలీ

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాత వార్త:**



సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటి ఆధ్వర్యంలో పట్టణంలోని అనిబిసెంట్ మునిసిపల్ హైస్కూల్ నుండి ర్యాలీ ప్రారంభించి పురవీదుల్లో తిరిగారు. ఈ ర్యాలీ నుద్దేశించి డిప్యూటీ జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి శివప్రసాదరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ నల్లబల్లి హిమబిందు పాల్గొని ప్రపంచఆరోగ్య దినోత్సవము ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ గురప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిర్డ్స్ ప్రసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి, సెక్రటరీ ఒంటెద్దు చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగభవాని, అల్లాబకష్ ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంవిఆర్ జయంతి సందర్భంగా అగస్తేశ్వరాలయంలో అన్నదానం

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాత వార్త :**



ప్రొద్దుటూరు మాజీ శాసనసభ్యుడు స్వర్గీయ డాక్టర్ ఎంవి రమణారెడ్డి 82వ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు మండల మాజీ ఉపాధ్యక్షుడు మల్లెల రాజారాం రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ మల్లెల ఝాన్సీ రాణిల సహకారంతో పట్టణ నడిబొడ్డునఉన్నశ్రీఅగస్తీశ్వరాలయంలో సోమ వారం మధ్యాహ్నం శివోహం సేవ సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ అధ్యక్షుడు శెట్టిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురికూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయ్ కుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్ రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

## రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజీలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాత వార్త :



ప్రొద్దుటూరులోని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్ లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎండాకాలంలో దాహార్తిని తీర్చే దానికోసమే మంచినీటితోపాటు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడమైనదని ఈ సందర్భంగా దాదాపుగా వెయ్యి మంది ప్రజలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని అందజేయడం జరిగినదని ఇటువంటి సేవా కార్యక్రమాల్లో రాణి తిరుమల దేవి కళాశాల ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరునేంద్ర శేఖర్, కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థిని విద్యార్థులు ప్రోగ్రాం ఆఫీసర్ ఇన్చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, ఏవో రాజు, అధ్యాపక అధ్యాపకేతరా బృందం పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన తల్లి బిడ్డ ఆరోగ్యం..

సుండుపల్లి, ఏప్రిల్7, ప్రభాతవార్త:



మండల పరిధిలో ని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య మే మహా భాగ్యం అనే నినాదంతో డాక్టర్ శేఖర్ రెడ్డి మరియు డాక్టర్ రూబీనా ఆధ్వర్యంలో ర్యాలీ మరియు అవగాహనా సదస్సు నిర్వహించారు. సరైన వయసులో వివాహం చేసుకోవాలని ఆడబిడ్డ వయసు 21సం రాలు ఉండాలని మగవారి వయసు 25 సం రాలు ఉండాలని, సరిఅయిన సమయం లో గర్భం దాల్చితే తల్లి బిడ్డ ఆరోగ్యం గా ఉంటారని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ హాస్పిటల్ నందు కాన్పు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ హాస్పిటల్ నందు వైద్య పరీక్షలు చేయించు కోవాలని, మంచి పౌష్టిక హారం తీసుకోవడం వలన తల్లి బిడ్డ ఆరోగ్యాంగా ఉంటారని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతి ఒక్కరు అన్ని పోసాకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని తెలియజేసారు. ప్రతి సంవత్సరం 3 లక్షల మంది తల్లుల మరణాలు, ప్రతి సంవత్సరం 20 లక్షల మంది నెల లోపు శిశు మరణాలు, ప్రతి సంవత్సరం20లక్షల మంది సంవత్సరం లోపు పిల్లలు మరణిస్తున్నారని కావున ప్రతి ఒక్కరు మంచి ఆహారపు అలవాట్లుకలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమం నందు ఎంపీహెచ వీరనారాయణ, సూపర్ఎల్లమ్మ, స్టాఫ్నర్స మరియు సి హెచ్ ఒ సాల్మహాన్ పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కోర్సుల్లో విద్యార్థులకు ఉచిత శిక్షణ,

### విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు వితరణ

మైదుకూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:



పాలిటెక్నిక్ కోర్సులలో చేరుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్యా మరియు శిక్షణా మండలి వారిచే ఏప్రిల్ 30, 2025న నిర్వహించబడు ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు చివరి తేదీ 15 ఏప్రిల్, 2025. కాగా, ప్రభుత్వ పాలిటెక్నిక్, మైదుకూరు సిబ్బందిచే నిర్వహించ బడుచున్న ఉచిత శిక్షణా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నదని ప్రిన్సిపాల్ డా. కె.వి. సుబ్బారావు తెలిపారు. ఈరోజు శిక్షణలో భాగంగా విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంచుతూ విద్యార్థులు రాబోయే కొద్దిరోజులు శ్రద్ధగా శిక్షణ పొంది ప్రవేశ పరీక్షలో ఉత్తమంగా రాణించి సరైన కోర్సులలో చేరి జీవితంలో ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. నిపుణులైన టీచర్లచే నిర్వహించబడుచున్న ఈ శిక్షణా కార్యక్రమానికి విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఇప్పటి వరకు 47 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ శిక్షణాలయంలో పాల్గొంటున్నారు. ఈ శిక్షణ ఈనెల 28వ తేదీవరకు 9.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ ఉపాధ్యాయులు డా. హెన్రీ థామస్, శోభావతి, బేబీ శాలిని, సుభాష్ చంద్ర బోస్ పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్ మృతికి సంతాపం



ముద్దనూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:పీలేరు నందు డిప్యూటీ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న రమాదేవి సోమవారం నాడు రాయచోటి సమీపములో సంబేపల్లి లోని ఎర్రగుంట్ల వద్ద రెండు కార్లు ఢీకొనడంతో ప్రమాదవశాత్తు కారు ఆక్సిడెంట్ అయ్యి డిప్యూటీ కలెక్టర్ రమాదేవి మరణించారు. ఆమె గతంలో ముద్దనూరు మండలం లో తహసీల్దార్ గా పని చేసి ఉన్నారని గుర్తు చేసుకొని ఆమె మరణ వార్త విని ఆమె ఆత్మకి శాంతి కలగాలని ముద్దనూరు తహసీల్దార్ వరదకిశోర్ రెడ్డి మరియు రెవెన్యూ సిబ్బంది సంతాపము తెలిపారు.

## ఆరోగ్యకరమైన ప్రారంభంఆశాజనకమైన భవిష్యత్తు.

తొండూరు ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):తొండూరు



గ్రామములోని 2 వ అంగన్వాడీ కేంద్రము నందు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన మహిళల సమావేశమునకు , హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య హాజరయ్యారు, ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం యొక్క ప్రాధాన్యత, "ఆరోగ్యకరమైన ప్రారంభము ఆశాజనకమైన భవిష్యత్తు". అనే అంశం పై అంగన్వాడీ కేంద్రం నందు మహిళల సమావేశం నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్రమణమ్మ, ఆరోగ్యకార్యకర్తలు పుల్లమ్మ, శుక్రు, కళావతి, అంగన్వాడీ కార్యకర్త గురు తేజ, కుమారి ఆశా కార్యకర్త మరియుడ్వాక్రా మహిళలు హాజరయ్యారు.

## ప్రహరీ గోడ పై చిత్రపటాల కోసం డబ్బు వితరణ

యర్రగుంట్ల ఏప్రిల్ 7 ప్రభాత వార్త

ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడకు దేశ నాయకులు, శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తలు, సమాజ సేవకులు చిత్రపటాలను వేయించుటకు సోమవారం బోయినపల్లి ప్రసాద్ రెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి 50 వేల రూపాయల ను ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల తరపున ధన్యవాదము తెలిపారు. ఈ పాఠశాల అభివృద్ధికి ఎంతో మంది పూర్వ విద్యార్థులు, దాతలు సహయ, సహకారాలు అందించడం ఎంతో గర్వించ దగ్గ విషయం. విద్యార్థుల్లో దేశభక్తి, సమాజ సేవ తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేయడం జరుగుతున్నది. కావున పూర్వ విద్యార్థులు, దాతలు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నామని తుపాకుల చంద్ర ఓబులరెడ్డి తెలిపారు

## చర్యలు తీసుకోవాలి..



కడప కార్పొరేషన్ ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

బ్రతుకుతెరువు కోసం పండ్ల వ్యాపారం చేస్తున్నాని, వ్యాపార నిమిత్తం రూ.30 లక్షలు అప్పుగా తీసుక్కున్నానని సోమవారం కడపలో మీడియాతో సయ్యద్ ఇబ్రహీం మియా తెలిపారు. 2019లో తీసుకున్న అప్పుకు కంతులవారీగా డబ్బును తిరిగి చెల్లించానని, కేవలం రూ.1,50,000 మాత్రమే ఇవ్వాల్సి ఉందన్నారు. మార్చి 29వ తేదీన చెన్నూరు బస్టాండ్ లో వ్యాపారం చేస్తున్న సమయంలో సదురు అప్పు ఇచ్చిన వ్యక్తి భార్య, చెల్లెలు అప్పు చెల్లించాలని బెదిరించారని చెప్పారు. వీరిపై చర్యలు తీసుకోవాలను అధికారులను కోరమన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల 42వ వార్షికోత్సవ దినోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే, ముక్కా రూపనంద రెడ్డి.

రైల్వేకోడూరు, అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త.



రాష్ట్రంలో చదువుకున్న ప్రతి యువతీ, యువకుడికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందడుగు వేస్తుందని కడప అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మన్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి , ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ అన్నారు. సోమవారం నాడు రైల్వేకోడూరు మండలం, బుడిగుంటపల్లి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ అధ్యాపకుల ఆహ్వానం మేరకు 42 వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముక్కా రూపానంద రెడ్డి , అరవ శ్రీధర్, సీఐ హేమ సుందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ యాజమాన్యం ఇరువురు నేతలకు ఘన స్వాగతం పలికారు. ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ స్థాపించి 42 ఏళ్ల అయిన సందర్భంగా యాజమాన్యానికి, విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు ఈ నెల 15 వ తేదీలోగా కాలేజీ విద్యార్థినుల కోసం ఒక ఎలక్ట్రికల్ వెహికిల్ అందజేస్తామని, ఆ తర్వాత మరొక వెహికిల్ కూడా అందజేస్తామని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి ఏం అవసరం వచ్చినా..అండగా ఉంటామని తెలియజేసారు. బుడిగుంటపల్లి ఆవరణ నందు త్వరలోనే 6 లేన్ రహదారితో మహర్దశ రానుందని తెలిపారు. అలాగే యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా..క్రమ శిక్షణ పాటిస్తూ, ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని పట్టుదల, ఏకాగ్రతతో మంచిగా చదువుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి చదువుకున్న యువతీ, యువకుడికి ఉన్నత విద్యలు చదువుకోవడానికి కూటమి ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు అనంతరం స్పోర్ట్స్ లో గెలుపొందిన విద్యార్థులకు కప్పులు అందజేశారు . ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9న సగినాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేకం



కడప కార్పొరేషన్ ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

ఈనెల 9 వ తేదీ వైభవంగా జరగనున్న సగినాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేకం మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విరివిగా తరలిరావాలని కతోలిక మేత్రాసన వికర్ జనరల్ తలారి బాలరాజు, కోశాధికారి సంబటూరు సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం మరియాపురం బిషప్ హౌస్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప డయాసిస్ కు నూతన కాపరిగా విశ్వ శ్రీ సభ కాపరి పోపు ఫ్రాన్సిస్ ద్వారా సగినల పాల్ ప్రకాష్ఎన్నుకోబడ్డారని తెలిపారు. సమావేశంలో తిరుపతివిచారణగురువుఫాదర్ఆనంద్, ఎర్రగుంట్ల విచారణగురువుఫాదర్ఇట్టా మోజెస్ పాల్గొన్నారు.

## నిరాహార దీక్ష ను విజయవంతం చేయండి

యర్రగుంట్ల ఏప్రిల్ 7 ప్రభాత వార్త

..మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష ..అర్హులైన నిరుపేదలందరికీ ఇంటిని , ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి ..భూములే నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమినివ్వాలి ..పెండింగ్ ఉన్న వసతి గృహాలు త్వరగా చేసి ఇవ్వాలి భారత కమ్యూనిస్టు పార్టీ యర్రగుంట్ల మండల సమితి ఆధ్వర్యంలో 9వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి ఎమ్మార్వో కార్యాలయం వద్ద రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, భూమిలేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని, టి డ్ కో ఇల్లు త్వరగా మరమ్మత్తులు చేసి లబ్ధిదారులకు అందించాలని ,ఎన్టీఆర్ నగర్ లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు త్వరగా పూర్తిచేసి ఇచ్చే విధంగా ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని నిరాహార దీక్ష చేయడం జరుగుతున్నది .కావున లబ్ధిదారులందరూ ఉదయం 9 గంటలకు ఎమ్మార్వో కార్యాలయం వద్దకు తరలి రావాలని ఎం వి సుబ్బారెడ్డి తెలిపారు .

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ

ముద్దనూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:



ప్రపంచ మానవాళి ఆరోగ్యమును కాపాడటానికి 1948 సంవత్సరం ఏప్రిల్ 7వ తేది ప్రపంచ ఆరోగ్య సమస్థ ఏర్పాటు చేయడం జరిగిందనీ, దీనికి ఆనవాయితీగ ప్రపంచఆరోగ్యదినం జరుపుకొంటున్నామని ముద్దనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. శ్రీకాంత్ సోమవారం రోజు తెలిపారు. ప్రపంచస్థాయిలో ఫెర్టీ లిటీ రేట్ ఆందోళన కర రీతిలో పడిపోయిందనీ, ప్రస్తుత పరిస్థితి లో మాతా శిశు సంరక్షణ అత్యంత అవసరము కనుక ఈ సంవత్సరం " ఆరోగ్య కర ఆరంభాలు.....ఆశా జనక భవితవ్యాలు" అనే నినాదం తో ముందుకు వచ్చింది. ప్రజా రోగ్యానికి మూలం తల్లి, బిడ్డల ఆరోగ్యం. తల్లి, బిడ్డను వేరు, వేరు గా కాకుండా ఒక యూనిట్ గా చూడాలని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 3లక్షల మాతృ మరణాలు, 20లక్షల నవజాత శిశుమరణాలు, 20లక్షల శిశుమరణాలు ప్రతి సంవత్సరం జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడు క్షణాల కు ఒక మాతా, శిశుమరణాలు సంభవిస్తున్నాయని, వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందినప్పటికి 2030సంవత్సరం కల్లా మనం సాధించవలసిన లక్ష్యాలలో మనం వెనుక బడి ఉన్నామని తెలిపారు. అనంతరం ఆయన పర్యవేక్షణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం పైర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, హెల్త్ సూపర్ వైజర్ శోభా కుమారి, స్టాఫ్ నర్స్ రమాదేవి, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, హెల్త్ అసిస్టెంట్ ఓబులేష్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## అమీన్ పీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి..

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్పీర్ దర్గాను హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి అహ్మద్ అక్బర్ సోమవారం దర్శించుకున్నారు. దర్గా ప్రతినిధులు స్వాగతం పలికారు. ప్రధాన గురువైన హజరత్ పీరుల్లామాలిక్ మాజర్ను, దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆ తర్వాత దర్గా ప్రతినిధులు గురువుల విశిష్టత, దర్గా ప్రాముఖ్యతను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి అహ్మద్ అక్బర్ మాట్లాడుతూ కడప పెద్దదర్గా గురువుల గురించి గతంలో పలుమార్లు తెలుసుకోవడం జరిగిందన్నారు. గురువుల పిలుపుతోనే తాను ఈ ప్రాంతానికి చేరుకోవడం జరిగిందన్నారు. గత రాత్రి తాను చిన్నపాటి రోడ్డుప్రమాదానికి గురైనప్పటికీ దర్గా గురువులను దర్శించుకోవాలన్న కోరికతో రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, పాల్గొన్నారు.

## భర్త కట్నం కొరకు ఒత్తిడి చేయడం క్రూరత్వంగా పరిగణించలేము

### (సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు)

బద్వేలు లీగల్, ఏప్రిల్ 07 ప్రభాతవార్త : భర్త, అత్త మామల నుండి వివాహిత మహిళలకు రక్షణ కల్పించేందుకు మాత్రమే ఐపిసి సెక్షన్-498(ఎ) ప్రకారం కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేయడాన్ని మాత్రమే క్రూరమైన నేరంగా నిర్ధారించలేమని సుప్రీం కోర్టు ఓ వ్యాజ్యములో స్పష్టం చేసింది. సెక్షన్-498(ఎ) ప్రకారం "క్రూరత్వం అనే పదానికి విస్తృతమైన అర్థాలున్నాయని పేర్కొంటూ కట్నం క్రింద ఆస్తులు గానీ, మరేదైనా విలువైన వస్తువులు గానీ ఇవ్వాలని ఒత్తిడి చేయడం చట్ట విరుద్ధమే అవుతుందని, అయితే కట్నం కొరకు మహిళను శారీరకంగా, మానసికంగా వేధించడం మాత్రం క్రూరత్వం అవుతుంది" అని తెలిపింది. కేవలం కట్నం డిమాండ్ చేశారని సెక్షన్-498(ఎ) క్రింద కేసు పెట్టినంత మాత్రాన క్రూరత్వంగా పరిగణించలేము అని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

## స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా మృతి చెందడం చాలా బాధాకరం

### రమాదేవి మృతదేహాన్ని పరిశీలించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త



పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మృతి చెందడం చాలా బాధాకరమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రమా మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ సోమవారం పీజిఆర్ఎస్ కా ర్యక్రమానికి వస్తుండగా సంబేపల్లి మండలం, ఎర్రగుంట్ల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి మృతి చందనం చాలా బాధాకరమన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రివర్యులు కోరారు. అనంతరం గాయపడిన వారిని మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్డిఓ, తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## ..అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం.. ఎస్సై లోకేష్ రెడ్డి.

తంబళ్లపల్లె ఏప్రిల్ 7 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండలం లో ఆ సాంఘిక కార్యక్రమాలు చేసిన ప్రోత్సహించిన వారిపై ఉక్కు పాదం మోపుతామని ఎస్సై లోకేష్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం అన్నగారి పల్లి పంచాయతీ చింతల రేవు పల్లి సమీపంలోని తిరగరాళ్లగుట్ట లో జరుగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఐదు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ 15,860 సొమ్ముతోపాటు 10 మోటార్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇంకా ఎనిమిది మంది పేకాటరాయుళ్లు పారిపోయినట్లు తెలిపారు. ఐదు మంది పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు, నాటు సారా తయారీ, కర్ణాటక అక్రమ మద్యం, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెంచామని ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరిగినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మండలంలోని మహిళా పోలీసులు, ప్రజలు తమకు సహకరించి మండలం ప్రశాంత వాతావరణంలో ఉండటానికి తమ వంతు సహకరించాలన్నారు.

## ఉనికి కోసమే రాచమల్లు ఆరాటం

**కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి**

ప్రొద్దుటూరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త



రాజకీయ ఉనికి కోసమే పదేపదే ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి పై ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరాటం పడుతున్నారని కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గోపవరం ఉప సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో జరిగిన సంఘటనలపై పదేపదే స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పై బురద జల్లడం రాచమల్లుకు తగదన్నారు. గతంలో వైసిపి అధికారం చేపట్టిన నాటి నుండి నియోజకవర్గంలో ప్రభుత్వ వ్యవస్థలను నీ కబంధ హస్తాలలో పెట్టుకొన్న రాచమల్లు చేసిన అవినీతి అరాచకం అంతా ఇంతా కాదని విమర్శించారు. అధికారంలో ఉండగా నీవు చేసిన అరాచకాలు ప్రజలకు అన్ని తెలుసని, మీ అవినీతి అరాచకాలపై ప్రశ్నించిన నందం సుబ్బయ్యను దారుణంగా హత్య చేసిన ఉదంతం ప్రజలకు గుర్తుందని విమర్శించారు. వైసీపీలో ఉన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ను ఎన్నిసార్లు బెదిరింపులకు పాల్పడ్డావో ప్రజలకు తెలుసు అన్నారు. ఫ్లెక్సీలలో ఫోటో పెట్టలేదని దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి పై దాడి చేసినది మరిచారా అని ప్రశ్నించారు. ఇంత చేసి తిరిగి పెద్దాయన వరద పై ఆరోపణలు చేయడం తగదన్నారు. నాడు కొత్తపల్లి సర్పంచ్ 13వ వార్డు ఎన్నికలలో వ్యవస్థలను అడ్డుపెట్టుకొని కోట్లు కుమ్మరించి ఏమి సాధించావని ఆయన ప్రశ్నించారు. ఇప్పటినుండి అయినా ప్రజల మేలుకోరి ప్రజా సమస్యలపై మాట్లాడి ప్రజాభిమానం పొందాలని ఆయన సూచించారు. రాజుపాలెం మాజీ జెడ్పిటిసి వెల్లాల భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవస్థలను వాడుకోవడంలో రాచమల్లు తర్వాతే ఎవరైనా అని ఎద్దేవా చేశారు. ఒక వార్డు మెంబర్ కి రాచమల్లు చేసిన అరాచకం కన్నా గోపవరం ఉప సర్పంచ్ ఎన్నికలలో జరిగే సంఘటనలకు ఎమ్మెల్యే వరదను బాధ్యులను చేసి పదేపదే ఆరోపణలు చేయడం రాచమల్లుకు తగదన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి టిడిపి నాయకులు పగడాల దస్తగిరి దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి పొట్టు లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీవో. ఎంపీడీవో ..

తంబళ్లపల్లె ఏప్రిల్ 7 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వేసవి దృశ్య ప్రజల సౌకర్యార్థం ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి చలివేంద్రం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ప్రజలు చదివినయం చేసుకోవాలని కోరారు. చలివేంద్రం ఏర్పాటు పై స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో థామస్ రాజా, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ నాయక్, టైపిస్ట్ సురేంద్ర, జూనియర్ అసిస్టెంట్ కిషోర్, కార్యదర్శి రామకృష్ణ, జనసేన నాయకుడు ఎద్దుల నరసింహులు, ఖయ్యూం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలతో ఏపిఎం, శ్రీనిధి మేనేజర్.

తంబళ్లపల్లె ఏప్రిల్ 7 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండలం లో మహిళా సంఘ సభ్యులు శ్రీనిధి నిధులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం గంగాధర్, శ్రీనిధి మేనేజర్ అమరావతిలు సూచించారు. సోమవారం మండలంలోని జుంజురపెంట పంచాయతీలో శ్రీనిధి నిధుల వినియోగంపై మహిళా సంఘాలతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో మహిళా సంఘాలకు విరివిగా బ్యాంకు రుణాలు తోపాటు శ్రీనిధి నిధులు రుణంగా పొందిన సభ్యులు సకాలంలో చెల్లించాలని సూచించారు. నిధులు దుర్వినియోగం జరిగితే భవిష్యత్తులో రుణాలు పొందాల్సి న వారికి అవకాశం ఉండదని సూచించారు. ప్రతి మహిళా సభ్యురాలు దృష్టిలో ఉంచుకొని వెలుగు ద్వారా పొందిన రుణాలు సకాలంలో చెల్లిస్తే భవిష్యత్తులో మరింత రుణం పొంది ఆర్థిక అభివృద్ధి సాధించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిసి కత్తి నరసింహులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జంగాలపల్లి, ఎర్ర బోయనపల్లె లో పుష్ప పల్లకిలో ఊరేగిన సీతారాముల వారు

రామసముద్రం, ఏప్రిల్7, ప్రభాతవార్త



రామసముద్రం మండలం ఆర్ నడుంపల్లి గ్రామపంచాయతీ, జంగాలపల్లి, ఎర్రబోయనపల్లి, కెసిపల్లి కురపల్లి, గ్రామలలో శ్రీరామనవమి వేడుకలలో భాగంగా 2వ రోజు శ్రీ సీతారాముల వారిని కార్య నిర్వాహకులు, ఆలయ పూజారులు అందంగా ముస్తాబు చేసి, పుష్ప పల్లకిలో ఊరు పురవీధుల గుండా స్వామి వారిని ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా గ్రామాలను విద్యుత్ దీపాలంకరణతో మిరమిట్లు కొలుపే కాంతులతో అందంగా అలంకరించారు. కార్యక్రమానికి మదనపల్లి వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, సీతారాములవారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఎస్సై రవికుమార్ సిబ్బంది గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు నిర్వాహకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాములవారి దర్శించుకున్న వైసిపినియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్

రామసముద్రం, ఏప్రిల్7, ప్రభాతవార్త



రామసముద్రం మండలంలో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీరామనవమి వేడుకలలో భాగంగా సోమవారం వైసిపి మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ కె సి పల్లి గ్రామపంచాయతీ కురపల్లి గ్రామంలో గ్రామస్తులు ఆహ్వానం మేరకు శ్రీ సీతారాములవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని ఆ సీతారాములవారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, ఈశ్వరరెడ్డి, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాలలో త్రాగు నీటి సమస్యలపై దృష్టి సారించండి

లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ 06 ప్రభాత వార్త



గ్రామాలలో త్రాగు నీటి సమస్యలపై దృష్టి సారించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మైథిలి పేర్కొన్నారు. సోమవారం ఆమె చౌటపల్లి హరిజనవాడ , దప్పేపల్లి కొండవాండ్లపల్లి గ్రామాలలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ కుమార్ , ఇన్చార్జ్ ఎంపీడీవో ఉషారాణి , పంచాయతీరాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం లతో కలిసి జిల్లా పరిషత్ గ్రాండ్ కు సంబంధించి త్రాగునీటి బోర్లను , చేతిపంపుల పనులను , అలాగే జిల్లా పరిషత్ గ్రాండ్ కు సంబంధించి పనుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడైనా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యు కిషోర్ కుమార్ , ఇన్చార్జ్ ఎంపీడీవో ఉషారాణి , పంచాయతీరాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం , జడ్పిటిసి రమాదేవి , పాల్గొన్నారు.

## మండల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ గా నీరుగట్టి కృష్ణప్ప నియామకం

రామసముద్రం ఏప్రిల్ 7 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా, మదనపల్లి నియోజక వర్గం, రామసముద్రం మండల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకులు నీరుగట్టి కృష్ణప్ప నియమితులైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కృష్ణప్ప మీడియా ద్వారా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి , మదనపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ నిస్సా ర్ అహ్మద్ , మదనపల్లి మాజీ ఎం మ్మెల్యే తిప్పారెడ్డి , మాజీ ఎంమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే షాజహాన్ బాషా చొరవతో ముప్పై లక్షలతో కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం

రామసముద్రం ఏప్రిల్ 7ప్రభాతవార్త



మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం కోసం సర్వ శిక్ష అభియాన్ పథకం కింద ప్రభుత్వం ముప్పై లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ మస్తాన్ భీ తెలిపారు. సోమవారం మండల టిడిపి అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించినట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నుండి ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల పరిరక్షణ కష్టం గా మారడంతో ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు . ఈ విషయమై విజయ్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యే షాజహాన్ భాషా తో చర్చించి ప్రహరీ గోడ నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారు. అంతేకాకుండా పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, రాళ్ళను తొలగించి పాముల బెడద నుండి విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి రక్షణ కల్పించారు. ప్రహరీ గోడ నిర్మాణపనులు చేపట్టడంతోపాటు పాఠశాల అభివృద్ధి కృషి చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ భాషా, విజయ్ కుమార్ గౌడ్ లకు పాఠశాల ప్రిన్సిపల్ మస్తాన్బీ ఉపాధ్యాయు లు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. భూమి పూజ కార్యక్రమంలో టిడిపి నేతలు మాజీ సర్పంచ్ బండెల శివప్ప, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, ఎల్. శివ. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జంగాలపల్లి, ఎర్ర బోయనపల్లె లో పుష్ప పల్లకిలో ఊరేగిన సీతారాముల వారు



రామసముద్రం, ఏప్రిల్7, ప్రభాతవార్త

రామసముద్రం మండలం ఆర్ నడుంపల్లి గ్రామపంచాయతీ, జంగాలపల్లి, ఎర్రబోయనపల్లి, కెసిపల్లి కురపల్లి, గ్రామలలో శ్రీరామనవమి వేడుకలలో భాగంగా 2వ రోజు శ్రీ సీతారాముల వారిని కార్య నిర్వాహకులు, ఆలయ పూజారులు అందంగా ముస్తాబు చేసి, పుష్ప పల్లకిలో ఊరు పురవీధుల గుండా స్వామి వారిని ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా గ్రామాలను విద్యుత్ దీపాలంకరణతో మిరమిట్లు కొలుపే కాంతులతో అందంగా అలంకరించారు. కార్యక్రమానికి మదనపల్లి వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, సీతారాములవారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఎస్సై రవికుమార్ సిబ్బంది గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు నిర్వాహకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మోహినీ అవతారంలో మురిపించిన తేజోమూర్తి



వాల్మీకిపురం, ఏప్రిల్ 07 ప్రభాతవార్త:: వాల్మీకిక్షేత్రంలో వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం రాత్రి 8:30 గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో తేజోమూర్తిగా మురిపిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 6:30గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు తేజోమూర్తిగా తిరుమాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. సూర్యప్రభ వాహన సేవ అనంతరం 10గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 8:30గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పల్లకీ మోహినీ అవతారంలో ఊరేగుతున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాఢవీధుల్లో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, అర్చకులు క్రిష్ణప్రసాద్ భట్టర్, క్రిష్ణరాజు భట్టర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణోత్సవం .. సర్వం సిద్ధం



వాల్మీకిపురం, ఏప్రిల్ 07 ప్రభాతవార్త: సీతారాముల కల్యాణానికి టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 08వ తేది మంగళవారం రాత్రి జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి టిటిడి అధికారులు ముస్తాబు చేస్తున్నారు. స్థానిక తోటివీధిలో ముమ్మరంగా కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవానికి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వేలల్లో భక్తులు హాజరవుతుండడంతో, భక్తులను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా షెల్టర్, చలవ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణోత్సవ విశిష్టత వాల్మీకిక్షేత్రంలో శ్రీ పట్టాభిరాముడు కల్యాణోత్సవానికి సీతమ్మ వారికి ప్రాధానత్య ఇస్తూ సీతమ్మ జన్మనక్షత్రమైన ఆశ్లేష నక్షత్రంలో సీతారాముల వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారని సలహాదారులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. సీతమ్మ చంద్రవంశపురాజు అయిన జనకమహారాజు కుమార్తె కావడంతో చంద్రదర్శనంలో కల్యాణోత్సవం నిర్వహించడం, చంద్రవంశల ఆనవాయితీగా పాటిస్తున్నారన్నారు.

### ఎస్ఆర్ఐటి సివిల్ విభాగాధిపతి చిన్న సురేష్ బాబుకి డాక్టరేట్



ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాత వార్త :, సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగాధిపతి చిన్న సురేష్ బాబు, ప్రొఫెసర్ శశిధర్, ప్రొఫెసర్ రామచంద్రుడు మార్గదర్శకంలో స్టడీస్ ఆన్ ఫ్లెడ్జర్ స్కేర్ ఆఫ్ ఆర్సిసి మెంబర్ విత్ గ్లాస్ ఫైబర్ రోప్ స్క్వేర్ రీ ఎన్ఫోర్స్మెంట్ అనే అంశము మీద పరిశోధనా పత్రాలు సమర్పించినందుకు గాను జేఎన్టీయూ అనంతపురం యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగినదని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కళ్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఒడిలు, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

#### పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారించండి సబ్‌కలెక్టర్‌కు బివైఎస్ నాయకులు వినతి



మదనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు చేపట్టాలని సోమవారం సబ్‌కలెక్టరేట్ ఆవరణంలో బహుజన యువసేన బివైఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం బివైఎస్ అధ్యక్షులు పునిత్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునిత్ మాట్లాడుతూ పట్టణంలో పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు బహుళ అంతస్థుల భవనాలు, ప్రైవేటు ఆసుపత్రి భవనాల యాజమాన్యాలు రోడ్డుకు అడ్డంగా ఇష్టానుసారం విద్యుత్‌ట్రాన్స్ పార్మర్లు అమర్చడం వల్ల ట్రాఫిక్ సమస్య జఠిలం అవుతోందన్నారు. ముఖ్యంగా సిటిఎం రోడ్డు, ఆర్టీసి బస్టాండు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉందన్నారు. ప్రైవేటు బిల్డింగ్, ప్రైవేటు ఆసుపత్రుల వారు కమర్షియల్ పరపస్ కోసం తీసుకొన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను స్వంత స్థలంలో నిర్మించుకోకుండా రోడ్డుకు అడ్డంగా నిర్మించి ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కూడా ట్రాఫిక్ సమస్యపై దృష్టి మళ్ళించి చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రోడ్లపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు ఆది, నాగార్జున, శశికుమార్, బాలక్రిష్ణ, వినయ్, ఉదయ్‌కుమార్, దినేష్, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహం తొలగింపునకు ఏపీఓకు వినతిపత్రం

పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త :



స్థానిక మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సదుం మండలం కలకటవారిపల్లిలో రాజ్యాంగ నిర్మాత "డాక్టర్" బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులు దగ్గరుండి తొలగించిన వైఖరిని ఖండిస్తూ విగ్రహాన్ని తొలగించడానికి కారకులైన తహశీల్దార్. సి.ఐ., ఎస్.ఐ., లపై ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని నేడు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పీలేరు రెవిన్యూ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం స్థానిక తహశీల్దార్ యం. భీమేశ్వర్ రావ్ అందుబాటులో లేకపోవడంతో తిలీవీ, పి. రామ్మోహన్ కు వినతి పత్రం సమర్పించారుకార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ముల్లంగి క్రిష్ణయ్య, నగరిమడుగు సుభాష్, షేక్ బోదేషా వలి, ఎద్దుల మహేష్ యాదవ్, గుండ్లూరు రాజేశ్వరి, షేక్ షాహిన్ షా, దప్పేపల్లి ఆనంద్, మద్దెలబాల గంగాధర్, జెట్టి దుర్గా ప్రసాద్, షేక్ అక్రమ్ బాషా, షేక్ మస్తాన్ సాహెబ్, గుండ్లూరు హరిబాబు, అర్పింటి రెడ్డెప్ప, కొప్పల వినయ్ కుమార్, చెంగల్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్‌సిక్స్ పథకాలు ఓ భూటకం

**అభివృద్దిని అడ్డుకోవడమే వారి అజెండా తంబళ్ళపల్లె వైసిపి నాయకులు ఎద్దేవా**



మదనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చకుండా కేవలం రాజకీయ కక్షసాధింపులకే పెద్దపీట వేస్తున్నారని తంబళ్ళపల్లె వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మదనపల్లెలోని ఎంపి మిథున్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైసిపి రాజంపేట అధికార ప్రతినిధి జయసింహారెడ్డి, ఎంపిపిలు భూదేవి, మహమ్మద్, పూర్ణిచంద్రిక రమేష్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు ఫీజు రీయంబర్స్‌మెంటు, వసతి దీవెన, వాహనమిత్ర, సబ్సిడీరుణాలు ఇవ్వకపోగా వైకాపా నాయకులపైకేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారు. అప్పద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చి మరోసారి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తొందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా స్పందించి పోయిందన్నారు. ముస్లిం మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లను ముస్లిం మైనార్టీలు క్షమించరు అన్నారు. బిసి జిల్లా అధ్యక్షులు సాంబశివ మాట్లాడుతూ 50శాతం బిసిలు ఉంటే కూటమి ప్రభుత్వం అనగదొక్కిందన్నారు. నేతన్న నేస్తం, మహిళలకు చేయూత ఇవ్వకుండా ఆపివేసిందన్నారు. తంబళ్ళపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. గతంలో చేపట్టిన ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టడం భావ్యం కాదన్నారు. ఈకార్యక్రమంలో వైకాపా నాయకులు వలసపల్లె రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పి ఎం ఎల్ ఫోటో...2 కట్టుదిట్టమైన భద్రత మధ్య హుండీ లెక్కింపు కార్యక్రమం 1000 ఎకరాల పొగాకు రైతులు ఆత్మహత్య లా లేక పరిహారమా సీపీఐ**

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్7 ప్రభాతవార్త:

ఎండకు, వానకు ఆరు గాలం కష్టపడే రైతన్నలను , కల్లబొల్లి మాటలు చెప్పి నమ్మించి పొగాకు సీడ్స్ కంపెనీ జిపిఐ యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతుకు నష్టపరిహారం అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, కార్యవర్గ సభ్యులు కేశవ , పిరయ్య లు రైతులకు న్యాయం జరగకపోతే ఉద్యమం తప్పదని వారు హెచ్చరించారు. ౦ ఈ సమయంలో వారి కుటుంబాలను ఆదుకొని ఒక ఎకరాకు 30 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం అందించాలని పాలక ప్రభుత్వాన్ని వారు కోరారు అలాగే జిపిఐ కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులకు డబ్బులు ఇప్పించే విధంగా పాలక ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

## చర్మకారుల సంఘం నూతన అధ్యక్షులుగా గురయ్య

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 7ప్రభాతవార్త:

టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త కె.రితీష్ రెడ్డి ఆదేశాల మేరకు చర్మకారుల సంఘం నూతన అధ్యక్షులుగా గురయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మున్నేల్లి గురయ్య మాట్లాడుతూ తన తండ్రి కేశవయ్య సంఘ అధ్యక్షులుగా సంఘ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఆయన మరణాంతరం తన తనపై నమ్మకం ఉంచి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రెడ్డి సంఘ సభ్యులు తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. రితీష్ రెడ్డి సహకారం సంఘాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, కోడూరు యేసు రత్నం, ప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు. అనంతరం టిడిపి కార్యాలయానికి వెళ్లి రితిష్ రెడ్డిని సన్మానించారు.

## శ్రీ మద్దిమాను గురప్ప స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 7ప్రభాతవార్త:

శ్రీ మద్దిమాను గురప్పా స్వామీ దేవస్థానం నందు సోమవారం హుండీ లెక్కింపు కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కింపు జరిగిందని ఈవో నరసయ్య పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో భాగంగా 5నెలలకు గాను 9లక్షల 7వేల 9వందల 88రూపాయలు వచ్చినవి. పై కార్యక్రమం నందు కిరణ్ కుమార్ రెడ్డి ఇన్స్పెక్టర్. ప్రొద్దుటూరు డివిజన్ ఆలయ ఈఓ నరసయ్య , అర్చకులు, పోలీసు సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ అమౌంట్ ను బ్యాంకులో జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాగిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సుబ్బరాయుడు, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్‌లో ఔరా 2కె-25 జాతీయ సాంకేతిక సింపోజియం



కురబలకోట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్(అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) విభాగం ఆధ్వర్యంలో ఔరా 2కె-25 జాతీయస్థాయి సాంకేతిక సింపోజియంను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి బెంగుళూరులోని సిమెన్స్ డేటా ప్రొపెసనల్ రీచర్స్ ఇంజనీర్ అరుణ్‌ఫాండేన్ మాట్లాడుతూ అర్థిఫిషియల్ ఇంటిలిజెన్స్ కృత్రియ మేదావి అదనంగా కలిపితే దాని విలువ రెట్టింపుకాలగదన్నారు. పోటీ ప్రపంచంలో విద్యనుంచి వైద్యం వరకు వ్యాపారం నుంచి వ్యవసాయం వరకు ప్రస్తుతం అర్థిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రమేయం ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. విద్యార్థులు నూతన పరిశోదనలపై దృష్టి సారించాలన్నారు. డేటా అనాలటిక్స్ మిషన్‌లెర్నింగ్, ఏఐ ఆధారిత పరిశోదనల్లో వారి అనుభవాన్ని విద్యార్థులకు పంచుకొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథం పాల్గొన్నారు. ఈ సింపోజియంలో సాంకేతిక సెన్సఃలో పేపర్ ప్రజెంటెషన్‌లో ప్రాజెక్టు ఎక్స్‌పోలు, పాల్గొనేవారిలో సృజనాత్మకతను ప్రేరేపించడానికి వివిధ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగాదిపతులు డాక్టర్ చొక్కానాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అశ్లీల నృత్యాలు ఇద్దరి అరెస్టు డిజెవాహనం సీజ్



కురబలకోట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

పర్మిషన్ లేకుండా డిజె పాటలకు హిజ్రాలతో అసభ్యకరంగా అశ్లీల నృత్యాలు నిర్వహించిన ఇద్దరిని సోమవారం అరెస్టు చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ స్థానిక విలేకర్లకు తెలిపారు. కురబలకోట మండలం ఎర్రబల్లి పంచాయితీ దిగువ చెన్నామర్రి సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా సోమవారం తెల్లవారుజాము అశ్లీల నృత్యాలు డిజె పాటలతో డ్యాన్స్‌లు చేస్తున్న నిర్వాహకులు కూని నరసింహులు(26), డిజె వాహన యజమాని మహేష్(42)లను అరెస్టు చేసి డిజె వాహనాన్ని స్వాదీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు, ట్రాన్స్‌జెండర్లు, స్త్రీలతో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

## సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కురబలకోట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై సోలార్ విద్యుత్ ఉపకరణాలను మంజూరు చేస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తంబళ్లపల్లె టిడిపి ఇన్‌చార్జ్ దాసరపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం కురబలకోట మండలం అంగళ్ళులో సబ్సిడీపై సోలార్ విద్యుత్ ఉపకరణాల షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పిఎం సూర్యఘర్ ముఫ్త్ గుజిడియోజనా పథకంకింద రూ.78వేలను ఒక్కో ఇంటికి మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా కరెంటు బిల్లులు ఆదాతో పాటు పర్యావరణానికి దోహదపడుతుందని తెలిపారు. ఒక్కసారి పెట్టుబడితో సుమారు 40ఏళ్ళ పాటు జీరో కరెంటు బిల్లులతో డబ్బును ఆదా చేసుకోవచ్చునన్నారు. ఈ పథకం కింద ధరఖాస్తుచేసుకునేవారికి బ్యాంకులు కూడా ఈఎంఐ ద్వారా రుణాలు మంజూరుచేస్తుందనితెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ సీడ్ మల్లికార్జుననాయుడు, టిడిపినాయకులుమండలకన్వీనర్‌వైజి. సురేంద్ర, దాదంవారిపల్లెసర్పంచ్ అమరావతమ్మ వెంకటరమణా రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి రెడ్డిశేఖర్, అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయచోటి ఎంపీడీఓకు గాలివీడు ఇంచార్జ్ బాధ్యతలు

గాలివీడు, ఏప్రిల్ 7(ప్రభాతవార్త):

రాయచోటి ఎంపీడీఓ సి. వెంకటేష్‌కు గాలివీడు ఎంపీడీఓ ఇంచార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జవహర్‌బాబు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో సోమవారం వెంకటేష్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం, ఇతరత్రా సర్వేల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

## మూగజీవాలకు అండగా నిలిచిన హెల్పింగ్‌మైండ్స్

మదనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :



ఎండ తీవ్రత ఉండడంతో అటవీప్రాంతంలో ఉన్న మూగజీవాలకు దాహర్తి తీర్చడానికి హెల్పింగ్‌మైండ్స్ అండగా నిలిచింది. ఈ సందర్భంగా హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబుబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ సంస్థ స్థాపించి 12ఏళ్ళు అయిన సందర్భంగా సోమవారం మదనపల్లె, కర్నాటక సరిహద్దు ప్రాంతంలోని వానర్లకు నీటి, ఆహారం తీర్చేందుకు తొట్టెలు ఏర్పాటుచేసి నీటి వసతి కల్పించడం జరిగిందన్నారు. రోజు రోజుకు ఎండలు పెరుగుతండడంతో అటవీప్రాంతంలో వన్యప్రాణులు ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. నీటికోసం వన్యప్రాణాలు, పక్షులు ఇబ్బందిపడుతూ మృత్యువాతపడుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్ సభ్యులు హర్ష కిరణ్, సికింధర్, చరణ్, రాబియాన్, అంజుమామ్, చైతు పాల్గొన్నారు.

# మన గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

నిమ్మనపల్లె, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో బస్టాండు ప్రాంతంలో మనగ్రోమోర్ సెంటర్‌ను వ్యవసాయ అధికారి మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరైన ధరలకు, సక్రమమైన తూకాలతో అందించడానికి ఇందులో ఎలాంటి తేడాలు రాకూడదని ఆయన తెలిపారు. మండలంలో దాదాపు 50మంది రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మనగ్రోమోర్ ఏరియా మేనేజర్ నరేంద్ర, మనగ్రోమోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నులార విందంగా కళ్యాణోత్సవం. .. హాజరైన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి.

కలకడ ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



శ్రీ సీతారాముల కల్యాణోత్సవం కనులార విందంగా నిర్వహించారు. మండలంలోని నడిపిచర్ల పంచాయతీ నడిమిచర్లలో వెలసిన శ్రీ సీతారాముల దేవాలయం నందు ఆదివారం రాత్రి కల్యాణోత్సవాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హాజరై ఆయనచేతులమీదుగాఅంగరంగవైభవంగా కల్యాణోత్సవం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అభిషేకాలు అర్చనలు నిర్వహించిన అనంతరం కళ్యాణోత్సవం నిర్వహించి పురవీధులలో ఊరేగించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టినట్టు తెలిపారు.

## చలివేంద్రాలు ఏర్పాటు

కలకడ ఏప్రిల్ 7 ప్రభాతవార్త : చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్ ఎదుట మరియు ఆర్టీసీ బస్టాండ్ నందు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవి కాలానికి ప్రజలకు నీటి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రాల వద్ద సుచి శుభ్రతను పాటించి ప్రతిరోజు చలివేంద్రాల్లో నీటిని నింపాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఫోటో రైట్ అప్ చలివేంద్రాలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ రహీం(5)

### హెచ్ ఎన్ ఎస్ ఎస్ డిప్యూటీ కలెక్టర్ రమా దేవి మృతి చెందడం బాధాకరం... ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



పీలేరు రాయచోటి చిత్తూరు జాతీయ రహదారి సంబేపల్లి సమీపం కారు ప్రమాదంలో పీలేరు హెచ్ ఎన్ ఎస్ ఎస్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి మృతి చెందడం బాధాకరమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె పీలేరు నుండి పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి రాయచోటి వెళ్తుండగా కారు ప్రమాదంలో మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న శాసనసభ్యులు కిషోర్ కుమార్ రెడ్డి హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకొనిఆమె కుటుంబ సభ్యుల్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె విధులలో నిర్వహించిన సేవలు మరువలేనివని ఎంఎల్ఏ కిషోర్ కుమార్ రెడ్డి కొనియాడారు.

# చెడు అలవాట్లే అనారోగ్యానికి కారణం

**. తలుపుల పి.హెచ్.సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి**

పీలేరు ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

మన చెడు అలవాట్లే మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని పీలేరు మండలం, తలుపుల పి. హెచ్.సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీలేరులోని సీయన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు "అలసట నుండి ఆనందం వైపు" అనే అంశముపై విద్యార్థులతో అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ జీవన నైపుణ్యాలనేవి చెప్పుకోడానికి చిన్నవైనా, వాటిని ఆచరిస్తే జీవితంలో పెద్ద ఫలితాలను ఇస్తాయని అన్నారు. "ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనకమైన భవిష్యత్తు" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానసిక, శారీరక ఆరోగ్యం ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా పొందాలంటే, తగినంత నిద్ర, శారీరక శ్రమ, బలానిచ్చే పోషకాహారం అవసరమని, మద్యం ధూమపానం లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, మంచి జీవితానికి ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పరచుకుని వాటికోసం నిరంతరం శ్రమించడం ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఏఎన్ఎం భార్గవి, ధన భాగ్యమ్మ విజయ, ప్రమీల, ఆశ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: కలికిరి మేజర్ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ. 80లక్షల వ్యయంతో పనులు మంజూరై పూర్తి చేసిన సిమెంటు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలో ఆయన పర్యటించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే విధంగా పీలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు అధిక సంఖ్యలో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, తహసీల్దార్ మహేశ్వరీభాయ్, పంచాయతీరాజ్ డీఈ మధుసూదన, ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి, కలికిరి పంచాయతీ ఈవో అశోక్, ఏపీఎం దేవసేన, ఏపీవో మంజుల, కలికిరి మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, కలికిరి మేజర్ పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేశ్వర్‌రెడ్డి, కలికిరి సర్పంచ్ ఎల్లయ్య, కలికిరి మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్టలో మంత్రులకు స్వాగతం పలుకుతున్న జగన్మోహన్ రాజు, పార్టీ

నాయకులుఒంటిమిట్టలో మంత్రుల బృందానికి జగన్ మోహన్ రాజు ఘన స్వాగతం రాజంపేట అర్బన్, ఏప్రిల్ 7 ప్రభాతవా

ఒ్ంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన కోసం విచ్చేసిన మంత్రులకు రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఘన స్వాగతం పలికారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రవాణా శాఖ, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, బీసీ జౌళి చేనేత శాఖ, కడప జిల్లా ఇంచార్జ్ మంత్రి సవిత ,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తో పాటు ఒంటిమిట్ట పర్యటనకు విచ్చేసిన పలువురు నాయకులకు గజ పూలమాలతో స్వాగతం పలికారు. మంత్రులకు స్వాగతం పలికిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు తోపాటు రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నర్సయ్య, ఒంటిమిట్ట మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

